# కథ
# వెర్రిబాగుల వెంకోజీ

- భమిడిపాటి సోమయాజి

'వెంకోజీ వెడ్స్ వనజాక్షి' అనే బోర్డు కళ్యాణ మండపంపైన, విద్యుద్దీపాలతో వెలిగిపోతూంటే చూసిన, వెంకోజీ తల్లిదండ్రుల మొహాలు, ఆ వెలుగుతో పోటీ పడుతున్నాయి! అప్పుడే ఆ బోర్డు చూడ్డానికి వచ్చిన ఆడపడచు మొఖం కూడా మంచి వెలుగుతో నిండిపోయింది! ఆడపడచు లాంఛనాలు దిట్టంగా ముట్టాయి! "అన్ని ఏర్పాట్లూ బహుశోభాయమానంగా ఉన్నాయి నాన్నగారూ" అంది ఆడపడచు.

"ఆలస్యమైనా మంచిపిల్లే కోడలిగా దొరికింది!" అంది వియ్యపురాలి హోదాలో వెంకోజీతల్లి.

అసలు వీళ్ళందరూ అంత సంబరపడ్డానికి కారణం లేకపోలేదు! వెంకోజీ చిన్నప్పట్నుంచీ అమాయకుడు. సరిగ్గా మాట్లాడడం తెలీదు. పొగడ్తలకి లొంగిపోతాడు. అందుకే అతన్ని చాలామంది 'వెర్రిబాగుల వెంకోజీ' అంటారు. మొత్తం మీద ముప్ఫైరెండో ఏట కళ్యాణ తిలకం ధరించాడు.

పెళ్ళిచూపులదగ్గర్నుంచీ వెంకోజీ వెర్రి బాగులతనం బయటపడుతూనే ఉంది! అయినా ఈ సంబంధమే ఖాయం చేసుకోడానికి కారణం లేకపోలేదు. వెంకోజీ యిద్దరు తోడళ్ళుల్లు అమితమైన తెలివిగలవాళ్లు! పెళ్లైనప్పటి నుంచి, రీతి తప్పకుండా వాళ్ళని వేపేస్తున్నారు! అందుకని యీ మూడో అల్లుడు వెర్రిబాగుల టైప్ అయితే కొంత ఊపిరి పీల్చుకోవచ్చుని, వెంకోజీని వెతికి పట్టుకున్నారు.

పెళ్ళిచూపుల్లో పెళ్లికూతుర్ని పెద్దలు వేయవలసిన ప్రశ్నలు వేసిన తర్వాత "అబ్బాయి వెంకోజీ ! నువ్వు కూడా ఏమైనా అడిగితే అడుగు," అన్నారు. వెంకోజీ నాన్నగారు.

పెద్ద గొప్పగా గొంతు నవరించుకుని, ఆ అమ్మాయిని, "పెళ్ళిమీద మీ అభిప్రాయం" అన్నాడు.

"నాకేం తెలీదు మీ అభిప్రాయమే నా అభిప్రాయం" అంది ఆ అమ్మాయి సిగ్గుపడుతూ...

"నాకు ఒక పెళ్ళిమీదేమిటి! దేని మీదా ఒక అభిప్రాయమంటూ లేదు. నాకూ ఏమీ తెలీదు" అన్నాడు వెంకోజీ.

"ఓరి వెర్రినాయనా! నిన్ననవసరంగా ప్రశ్న వెయ్యమన్నాను" అనుకున్నాడు వెలవెలపోతూ, వెంకోజీ తండ్రి.

తర్వాత కొన్నాళ్ళకి, తాంబూలాలు వధువు యింట్లోనే తీసుకున్నారు. వందమంది చుట్టాలూ పక్కాలూ వచ్చారు ! భోజనాలు అవుతున్నాయి. వెంకోజీ అరిసె అరిసెపళంగా తినెయ్యడం చూసిన వెంకోజీ తండ్రి, రెండు ముక్కలైనా చేసి తినమని రెండు వేళ్ళు సంకేతంగా చూపించాడు. సాధారణంగా విజయానికి సంకేతంగా, ఎలక్షన్లప్పుడు రాజకీయనాయకులు రెండువేళ్ళు చూపించడం టీ.వీలో చాలాసార్లు చూసిన వెంకోజీ, తన నాన్నగారు రెండేసి అరిసెలు తిని విజయం సాధించమన్నారేమోనని రెండేసి అరిసెలు తినడం మొదలెట్టాడు, వెంకోజీ. "హమ్మయ్య ! మనమనుకున్నట్లు మూడో అల్లుడు వెర్రి బాగులవాడు దొరికాడని" తెగ సంతోషపడ్డారు అత్తమామలు.

వెంకోజీ పెళ్లైపోయింది. పెద్ద పండుగ కూడా వచ్చేసింది. అతని పెళ్లైన తర్వాత అదే మొదటి పండుగ! వెంకోజీ తన వాళ్ళందరితో పండక్కి అత్తారింటికి తరలి వెళ్ళాడు.

సంక్రాంతి నాడు భోజనాలయిన తర్వాత, వెంకోజీ తాంబూలం సేవిస్తూ, అక్కడే బీరువాలో ఉన్న ఒక పుస్తకం చూపించి తన బావమరిదిని "ఆ పుస్తకమేమిటి?" అని అడిగాడు. "ఒక్క నిముషం యిప్పుడే వస్తున్నానని" చెప్పి, లోపలికి వెళ్లి వెంకోజీ అత్తగార్ని మామగార్ని కూడా అక్కడకి రప్పించి కూర్చోపెట్టి, "ఆ పుస్తకమా బావగారూ! అది 'అలిఖితం' అన్నాడు. వెంకోజీ పెద్ద గొప్పగా, తనకి కూడా మంచి భాషాపరిజ్ఞానం ఉందని తెలియపరచడానికి "సమగ్రమేనా!" అన్నాడు.



కొత్త అల్లుడు కదా పైకి నవ్వితే బాగుండదని అక్కడున్న వాళ్లంతా లోలోపల నవ్వుకున్నారు.

అక్కడే ఉన్న వెంకోజీ నాన్నగారు, అది తెల్లకాయితాల పుస్తకం అంటే " విషయం పూర్తిగా ఉందా!" అని అడుగుతున్నాడు వీడు అని బాధపడ్డారు.

"వెర్రివెంకోజీ వెయ్యేళ్ళు వర్ధిల్లు!" అనుకున్నారు. వెంకోజీ అత్తమామలు.

"ఈ వెర్రాడు తోటి అల్లుడుగా రావడం మన అదృష్టం! మొత్తమంతా మనమే సంగ్రహించవచ్చు! అనుకున్నారు. పెద్దల్లుడు, చిన్నల్లుడూ.

ఆ సంక్రాంతి అలాగడిచింది! తర్వాత సంక్రాంతికి, వెంకోజీ తన అత్తారింటికి వెళ్లలేదు. ఈ సంక్రాంతికి హైదరాబాద్‌లోనే గడిచింది. వెంకోజీ తన భార్య, మిత్రుని కుటుంబాన్ని తీసుకుని మంచి పట్టుచీర కొనటానికి బట్టల దుకాణానికి వెళ్ళాడు. అక్కడ నాలుగు వేల రూపాయల ఖరీదున్న పట్టుచీరే యిష్టపడింది, వెంకోజీ భార్య.

వనజాక్షీ 'అంత డబ్బుమనం పెట్టలే. ఇంకా ఈ నెల చాలా ఖర్చులున్నాయి, అందుకని ఒక మూడు వేలల్లో ఏదైనా పట్టుచీర తీసుకోమన్నాడు వెంకోజీ నెమ్మదిగా....

సరేనని అలాగే చేసింది, వనజాక్షి, లోలోపల బాధ కల్గినా, ఇవన్నీ గమనిస్తున్న వెంకోజీ మిత్రుడు, ఈ వెంకోజీ గాడికి భోగినాడు పెద్దతలంటే ఉంటుంది! మొత్తం పీడ విరగడైపోతుంది! అనుకున్నాడు.

అపలేం జరిగిందో చూద్దామని వెంకోజీ మిత్రుడు భోగినాడు ఉదయమే, వెంకోజీ యింటికి వచ్చాడు. కళ్ళు ఎర్రబడి తువ్వాల్తో కళ్ళకి ఆవిరి పెట్టుకుంటున్నాడు, వెంకోజీ.

"కూర్చోరా! ఏంలేదు, కుంకుడు కాయపులుసు కళ్లలోపడింది." అన్నాడు వెంకోజీ.

"నేనకున్నట్లే అయింది! " అన్నాడు మిత్రుడు.

'నువ్వనుకున్నట్లవడమేమిట్రా' !

"ఆ ! ఏం లేదు! నేనొచ్చేసరికి నీకు వనజాక్షి యిలా తలంటేసి ఉంటుందనుకున్నాను. అలాగే నీతలంటు పూర్తయిపోయింది. పీడా పోయింది!" అన్నాడు. మిత్రుడు.

"పీడాపోవడమేమిట్రా'!

"అదేరా భోగి పీడ" అని "వెర్రివెంకోజీ! ఆ నాలుగు వేల చీర కొనుంటే ఆవిడ మనస్సు చల్లగా ఉండేది! నీ కళ్ళూ చల్లగా ఉండేవి!" అనుకున్నాడు మనస్సులో...

వనజాక్షి కాఫీలుపట్టుకొచ్చింది! అది తాగి, "ఏమిటి చెల్లమ్మా! అన్నంలో కలుపుకునే అంత పులుసు కళ్లలో కలిపేసావ్! మా వెంకోజీ అమాయకుడు! వచ్చే సంవత్సరం, ఒక పట్టుచీర నాలుగు వేలు పెట్టికొంటాడులే! అన్నం పెట్టేదప్పుడు మాత్రం వేడివేడి పులుసూ, చారూ లాంటివి వాడి చేతిమీద పోసెయ్యకు సుమా! " అన్నాడు నవ్వుతూ వెంకోజీ మిత్రుడు.

"అయ్యో అన్నయ్యగారూ! మీరు నిశ్చింతగా ఉండండి! " పాణిని గ్రహించిన చేతిని ఎప్పుడూ పరిరక్షించుకునే పత్నిని నేను" అంది వనజాక్షి.

వెర్రిబాగుల వెంకోజీ, వెర్రిమొహం వేరే వెయ్యఖర్లేక పోయింది.!

❀ ❀ ❀

నాకు వ్యక్తి మోక్షం వద్దు, దేశంలో ఒక కుక్క పస్తు ఉన్నా నేను మాటిమాటికి జన్మిస్తూనే ఉంటాను - వివేకానంద